పామాయిల్ సాగుకు ఆదరణ

- ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు
- అంతరపంటగా అపరాల సాగుకు అవకాశం
- మక్కువ చూపుతున్న రైతాంగం



సింగవరంలో పామాయిల్ సాగుకు డ్రిప్ సిస్టం



బండిరేవు గ్రామంలో సాగులో ఉన్న ఆయిల్ పామ్ తోట

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని రైతాంగం వ్యవసాయసాగు రంగంలో నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. గతంలో వరి, పత్తి, మిర్చి, కంది మాత్రమే సాగుచేసే రైతులు.. మారిన కాలానికి అనుగుణంగా డిమాండ్ ఉన్న నూతన పంటల సాగు వైపు దృష్టిపెడుతున్నారు. సంప్రదాయ వ్యవసాయ సాగులో వాతవరణ మార్పులు, అతివృష్టి, అనావృష్టి కాలాలతో రైతాంగం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు గమనిస్తూనే ఉన్నాం. వాటిని అధిగమించేందుకు మండలంలో సొంత భూమి కలిగిన రైతులు పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రైతులు పామాయిల్ సాగు చేసే దిశగా ప్రభుత్వం పోత్సహిస్తుండటంతో రైతులకు పెట్టుబడి ప్రోత్సాహం కింద సబ్సిడీ అందజేస్తుండటంతో రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టారు.

పామాయిల్ సాగు చేపట్టాలనుకునే రైతులు ధరణి పాస్ పుస్తకం కలిగి పొలంలో బోరు బావి, కరెంట్ వసతులు ఉంటే పంటను మంచిగా సాగుచేసుకోవచ్చు. ఎకరానికి రూ.1140 డీడీ ద్వారా చెల్లించి 57 ఆయిల్ పామ్ మొక్కలు ఆయిల్ పామ్ కంపెనీ నర్సరీల నుంచి పొందవచ్చు. నాలుగు సంవత్సరాల్లో ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తుంది. ఆయిల్ పామ్ తోటలో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటలుగా అరటి, బొప్పాయి, జామ, మల్బరీ, మొక్కజొన్న, కూరగాయాలు, వేరుశెనగ, కందులు, మినుములు, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, మిరప, పత్తి, పశుగ్రాసాలను పెంచుకుని అదనపు ఆదాయం పొందవచ్చు.

అందించే రాయితీలు ఇలా..

పామాయిల్ సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలను ఇస్తోందని అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో వరిసాగు స్థానాన్ని పామాయిల్ భర్తీ చేసే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు, ఎరువులను రాయితీపై సరఫరా చేస్తోంది. పామాయిల్ తోటల్లో అంతర పంటలుగా సాగు చేస్తే వాటికి కూడా రాయితీపై ఎరువులు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. పామాయిల్ తోటలు పెంచేందుకు ముందుకొచ్చే రైతులకు ఎకరానికి 57 మొక్కలను పూర్తి రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. మొక్క ధర రూ.213 కాగా రైతు రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. మిగతా నగదును ఉద్యాన శాఖ భరిస్తుంది. రవాణా ఖర్చు రైతులదే. మొక్కలు నాటిన తర్వాత హెక్టారుకు రూ.4,200 ఎరువులపై వరుసగా నాలుగేళ్లు రాయితీ ఇస్తారు. వీటిలో అంతర పంటలుగా సాగుచేసే పంటలకు కూడా రూ.4,200 ఎరువులు రాయితీ అందిస్తారు. పామాయిల్ సాగుకు ఆసక్తి చూపే రైతులు జిల్లా, మండల ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

పామాయిల్ సాగు లాభదాయకంతోపాటు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడంతో మండలంలో ఈ పంటల విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. నర్సాపురం, చిన్నబండిరేవు, కమాలాపురం, దుమ్ముగూడెం, సింగవరం, కాటాయిగూడెం గ్రామాల్లో ప్రస్తుతం సుమారు 15 మంది రైతులు 63.32 ఎకరాల్లో పామాయిల్ తోటలు పెంపకం చేపట్టారు. విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా రైతులు అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ విషయం.

ఆయిల్ పాంకు డిమాండ్



ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంట ఆయిల్ పామ్ సాగు. ఇందుకోసం రైతులకు ప్రభుత్వం అనేక రకాల ప్రోత్సహకాలను అందిస్తోంది. సొంత భూమి కలిగి బావి, కరెంట్ ఉంటే ఎవరైనా ఆయిల్ పామ్ పంటను సాగుచేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను పొంది రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి. ప్రస్తుతం జిల్లాలో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాం. ఆయిల్ పామ్ పంటలు విస్తృతంగా సాగు చేపడితే ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటాం.

–జినుగు మరియన్న, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు



పాములేరు వాగు ప్రవాహ ఉధృతికి గుల్లై ప్రమాదకరంగా మారిన ఆర్అండ్‌బీ రోడ్డు

ములకలపల్లి: మండలపరిధిలోని తాళ్లపాయ శివారులో కోతకుగురైన ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు 1.85 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. గతంలో విస్తారంగా కురిసిన వర్షాలకు పాములేరు వాగు ఉధృతికి రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఘటనా ప్రదేశాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో అధిష్టానికి సమస్యను విన్నవిస్తూ నిధుల మంజూరుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా లేఖ రాశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంపై స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

అశ్వారావుపేటరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దూరిశెట్టి అనుదీప్‌కు శుక్రవారం వినతి పత్రాలను అందించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సన్మానం చేశారు. ఆ తర్వాత పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద గల ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సొంత స్థలాలు ఉన్న పేదలకు రూ. 3లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు జి.రామకృష్ణ, రఫీ, సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలకు డ్రెయినేజీ మంజూరు చేసి నిధులు కేటాయించాలని ప్రిన్సిపాల్ సంగీత కలిసి వినతి చేయగా, చర్యలు తీసుకుంటానని కలెక్టర్ చెప్పారు.

ఉపాధిహామిని నిర్వీర్యం చేసే కుట్ర

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామిని నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతుందని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. బూర్గంపాడులో శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను, వ్యవసాయ కూలీలను కేంద్రప్రభుత్వం పేదరికంలోని నెడుతుందన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బర్ల తిరుపతయ్య, బయ్యా రాము, డేగల శ్రీను, వెంకటేశ్వర్లు, రమణయ్య, అచ్చయ్య, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి కార్మికులను అర్హులుగా ప్రకటించాలి

మణుగూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న గృహలక్ష్మి పథకానికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను అర్హులుగా ప్రకటించి లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని ఇఫ్టూ ఏరియా నాయకులు మంగీలాల్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సొంత ఇళ్లు లేవని, వారిని అర్హులుగా ప్రకటించి లబ్ధిదారులుగా జాబితాలో చేర్చాలన్నారు. గురుమూర్తి, శంకర్ నాయక్, నాగేశ్వరరావు,రజబ్ అలీ, శివరామకృష్ణ, నాగరాజు, శంకర్, శ్రీను, సాంబయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు వాయిదా

మణుగూరు రూరల్ : ఈ నెల 12,13 తేదీల్లో జరగాల్సిన సీఐటీయూ రాష్ట్ర మహాసభలు వాయిదా పడినట్లు సంఘం బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం అన్నారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాద్, ఈశ్వరరావు, లక్ష్మణ్‌రావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ



వితరణ అందజేస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఒక కుటుంబానికి శుక్రవారం వితరణ అందించారు. మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ సూరంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోడెం నాగేశ్వరరావు ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అందజేసిన 50 కేజీల బియ్యం, దుస్తులు, దుప్పట్లు, వంట పాత్రలను బీఆర్ఎస్ నాయకులు అందించారు. టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు బిర్రం వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, సాంబశివరావు, చందా లక్ష్మీనర్సయ్య, చందా వేణు పాల్గొన్నారు.

'కంటివెలుగు' ప్రారంభం

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ దారావత్ పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ తనుజ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, ఎస్డీ రసూల్, ఉపసర్పంచ్ దారావత్ రామారావు, గాదె లింగయ్య, రఘునంద సాయిబాబు, హెచ్ఎస్ ఎం డి.ఇమాం, రేఖన, నీలిమ, శ్రీదేవి పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ములకలపల్లి : ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం సీఐటీయూ, తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణా రైతు సంఘాల మండల సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శివర్గ సభ్యురాలు దుబ్బా ధనలక్ష్మి, తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, రావూజా, నాగేశ్వరరావు, ఆదినారాయణ, గోపగాని లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు

వర్గీకరణను మరిచిన కేంద్రం



ఎమ్మార్పీఎస్ సంగ్రామ యాత్ర

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసగిస్తుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ ఆరోపించారు. మాదిగల సంగ్రామ యాత్ర శుక్రవారం మండలంలో కొనసాగింది. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం నుంచి బూర్గంపాడు, మోరంపల్లి బంజర మీదుగా మాదిగల సంగ్రామ యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో దేపంగి రమణయ్య, కూరపాటి సునీల్, కనకం రవి, వెంకటేశ్వర్లు, రామచంద్ర, క్రాంతి, సురేష్, రాజా పెరియార్, కొమ్ము హుస్సేన్, కొండయ్య పాల్గొన్నారు.

కుట్రపూరిత దాడులకు భయపడేది లేదు..



అశ్వాపురం : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బూర్గంపాడు/అశ్వాపురం/పినపాక/ కరకగూడెం /మణుగూరు రూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీబీఐని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నేతలపై చేస్తున్న కుట్రపూరిత దాడులకు భయపడేది లేదని బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల మనసులో కేసీఆర్ సుస్థిర స్థానం సాధించగాద. ఇది ఓర్వలేక బీజేపీ దాడులకు పాల్పడుతోందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డితో పాటు జలగం జగదీష్, పొడియం నరేందర్ పాల్గొన్నారు. ఇక అశ్వాపురంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్‌ను ప్రజల నుంచి దూరం చేయలేరని చెప్పారు. కాగా, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు సంక్షేమ పథకాల అమలుకు నిర్ణయించడంపై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడగా జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, నాయకులు వీరభద్రం, ఎన్నా అశోక్‌కుమార్, గద్దల రామకృష్ణ, నయీం, వెంకటరమణ, అశోక్, ఏనిక రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే, పినపాకలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎంపీపీ గుమ్మడి గాంధీతో పాటు కంది సుబ్బారెడ్డి, పానుగోటి భద్రయ్య, కోలేటి భవానీశంకర్, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు. కరకగూడెంలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీకి అస్థిత్వం లేక కక్ష సాధింపు చర్యలు పాల్పొడుతోందన్నారు. ఎంపీపీ రేగా కాళిక, బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బుడగం రాము, మండల నాయకులు బైరిశెట్టి చిరంజీవి, రావుల రవి, యాకుబ్ ఖాన్ పాల్గొన్నారు.

అలాగే మణుగూరులో పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జెడ్పీటీసీ పోశం నర్సింహరావు మాట్లాడుతూ.. .దేశంలో బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను ప్రజాక్షేత్రంలో తిప్పి కొడతామన్నారు. ఎంపీపీ కారం విజయకుమారి, నాయకులు ముత్యం బాబు, అడపా అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, బొలిశెట్టి నవీన్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కార్పొరేటీకరణను అడ్డుకుందాం

చంద్రుగొండ: వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతోందని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేవళ్ల వీరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, ఆర్.వెంకటాచారి, జంగిలి వెంకటరత్నం పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

అశ్వాపురం: గొప్ప సంకల్పంతో పేద విద్యార్థులకు 62 రోజుల పాటు నేను సైతం సోషల్ రెస్పాన్స్ బిలిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించిన తారా ప్రసాద్ సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ మణుగూరు వ్యవస్థాపకులు పిల్లారిశెట్టి హరిబాబు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం 62 వరోజు ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యప్రకాష్ అధ్యక్షతన సభ నిర్వహించి ప్రసాద్‌ను సన్మానించారు.

రుణాలు మాఫీ చేయాలి

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీని వెంటనే చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు మునిశెట్టి రామ్మోహన్ రావు అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతు రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు గుర్రముచ్చు జయరాజు, ఆవుల సుబ్బారావు, అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా బైక్ యాత్ర



యాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న సిద్దులు

భద్రాచలం: కేంద్రం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా బీఆర్ఎస్ నాయకుడు తూతిక ప్రకాష్ శుక్రవారం బైక్ యాత్రను చేపట్టారు. ఈ యాత్రను సీనియర్ నాయకుడు తిప్పన సిద్దులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ... ఈ యాత్రను మంత్రి వర్యులు హరీష్‌రావు, ఎమ్మెల్సీ వద్దిరాజు రవిచంద్ర అందజేసిన ద్విచక్ర వాహనంపై చేపట్టినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు జిల్లాలో ఈ యాత్ర ద్వారా సాధారణ ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని వివరిస్తానని వెల్లడించారు.

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుడు ప్రకాష్ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్రకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. మండలంలోని లక్ష్మీనగరం గ్రామం చేరుకున్న యాత్రకు బీఆర్ఎస్ అధికార ప్రతినిధి యండి జానీపాషా, నాయకులు దామెర్ల శ్రీనివాస్, గంగరాజు, ఎంపీటీసీ సోడి తిరుపతిరావులు సంఘీభావం ప్రకటించారు.

స్టాఫ్‌నర్స్‌కు అవార్డు



శంకరమ్మను అవార్డుతో సన్మానిస్తున్న దృశ్యం

చంద్రుగొండ: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న బడికల శంకరమ్మకు స్టార్‌మహిళా అవార్డు లభించింది. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవింద్రభారతిలో ఆమె శుక్రవారం అందుకున్నారు. విశ్వంబరి చారిటబుల్ ట్రస్టు, సావిత్రిబాయిపూలే మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకరమ్మకు అవార్డు ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాళ్లూరి సువర్ణకుమారి, మాధవి, ఆర్గనైజేషన్ ఫౌండర్ స్వరూపారాణి, నాగలక్ష్మి, డాక్టర్ ఆర్వీ లక్ష్మి, నవనీత, ఉషాగిరి, నీరజారెడ్డి, రాజనందన్ పాల్గొన్నారు.

చైర్మన్ పదవిని రద్దు చేయాలి

అశ్వారావుపేటరూరల్: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నియమించిన చైర్మన్ పదవిను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పాయం దుర్గారావు డిమాండ్ చేశారు. అశ్వారావుపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినాయకపురం వద్దగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి దేవస్థానానికి నిబంధనల ప్రకారం గిరిజనులకు చైర్మన్ పదవి ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టాన్ని పట్టించుకోకుండా గిరిజనేతర మహిళను నియమించడం తగదన్నారు. అలాగే దొడ్డిదారిన ప్రమాణ స్వీకారం చేయించిన ఆలయ ఈవోను తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో వెంకట స్వామి, ముత్తయ్య, ఎస్ ధర్మరాజు, కొవ్వాసి హరిబాబు, మడకం కామేష్, కొర్రి మల్లయ్య ఉన్నారు.

సావిత్రీబాయికి నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలె వర్ధంతి సందర్భంగా శుక్రవారం సావిత్రీబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఆశ వర్కర్‌గా రాష్ట్ర పురస్కారం రూ.లక్ష నగదు బహుమతి పొందిన ఆశ వర్కర్ కృష్ణవేణిని ఎంపీటీసీ నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కందిమళ్ల రామిరెడ్డి, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, శ్రీను, పర్వత నరేష్, చిట్యాల సత్యం, రాములు, నెహ్రూ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

కరకగూడెం: మండల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి కుమార స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యాధికారి రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంఎన్ఓ శ్రీనివాసరావు, సర్పంచ్ ఇర్ప విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీనాథ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ గేట్ సమీపాన మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రహదారి వెంట ఉన్న ఈ కల్వర్టుపై రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న కల్వర్టుపై రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

- అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, ఏఈ, ఆర్అండ్‌బీ
సెల్ నంబర్ :94414 35367

క్లుప్తంగా

క్రీడాకారిణికి సన్మానం

అశ్వాపురం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా మాస్టర్ చాంపియన్ షిప్ నేషనల్ లెవల్ అథ్లెటిక్ పోటీల్లో ఐదు పతకాలు గెలిచి దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి, అశ్వాపురం పంచాయతీ వార్డు సభ్యురాలు మొర్వినేని చంద్రకళను పంచాయతీ పాలకవర్గం శుక్రవారం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణోత్ శారద, ఉపసర్పంచ్ చందూలాల్, వార్డు సభ్యులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రాధిక, కొమరం కౌసల్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య, అంగన్‌వాడీ టీచర్లు భారతి, విజయ, అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ప్రజా ప్రతినిధులకు ఆటల పోటీలు

దుమ్ముగూడెం: మండలంలోని మహిళా ప్రజా ప్రతినిధులకు ఈ నెల16న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుని 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ మహిళా ఉద్యోగులు సోమవారం సాయంత్రం లోపు జూనియర్ అసిస్టెంట్ శ్రావణి దగ్గర పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అతిథి అధ్యాపక పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

మణుగూరు రూరల్ : మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ అతిథి(గెస్ట్) అధ్యాపక పోస్ట్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ, నెట్,సెట్ విద్యనభ్యసించిన అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 13 సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, 14న కళాశాల ఆవరణలో ఉదయం 10.30కు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అన్నపురెడ్డిపల్లి, ఒడ్డుగూడెం, తొట్టిపంపు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కోసం శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, రైతులు, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పినపాక: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని ఈ బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. కొత్త రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుమ్మా శైలజ తమ పాడి గేదెను మేత కోసం బయటకు వదిలింది. ఈక్రమంలో గోడ పక్కన ఉన్న స్తంభం వైర్‌ను తాకిన గేదె షాక్‌తో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందింది. సుమారు రూ.40వేల విలువైన గేదె మృతి చెందినందున తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు కోరారు.

రేపటి నుంచి శ్రీ పోలమాంబదేవి జాతర

అశ్వారావుపేటరూరల్: మండలపరిధిలోని అచ్యుతాపురం గ్రామ శివారులో కొలువుదీరి ఉన్న శ్రీ పోలమాంబ దేవీ అమ్మవారి ఆలయం వద్ద తీర్థ జాతర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. రేపు నుంచి 16 తేదీ వరకు ఈ జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని, ఉత్సవాల సందర్భంగా ప్రతీ రోజు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

సమస్యల పరిష్కారానికి కృషి

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు హెల్త్‌కార్డు షేర్ కట్టు విషయమై ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును కలిసి తెలుపగా సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం స్థానిక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, భూషన్‌రావు, వెంకన్న, హనుమంతురావు, ఖాదర్, నరసింహా, రామచంద్రరావు, తులసీదాసు నాయకులు తదితరులు పాల్గొన్నారు.